# గలగలా గోదారి

భైరవయ్య

అమ్మవారి సావిడి దగ్గర హడావుడిగా వుంది. ఊరంతా అక్కడే మేటేసుకు పోయిందా అన్నట్టుగా వుందిరా అబ్బాయ్. సావిడి అరుగు మీద పెద్దలు కూచుని వున్నారు. సావిడి చుట్టూతా కిక్కిరిసి పోయిన జనం వున్నారు.

అసలు విషయమేమిటంటే సేనాపతుల వెంకన్నకీ, సూరపరాజు గారి పెద్ద కొడుకు వెంకటపతిరాజుకీ మధ్య తగవు విచారింపబడుతోంది. విచారిస్తున్నవారు పుల్లయ్య గారు. వారికి సాయంగా కుల పెద్దలంతా వున్నారు. అది ఆ వూరి న్యాయస్థానం. పుల్లయ్యగారు ప్రధాన న్యాయ మూర్తి.

ఆ రోజుల్లో ఇప్పట్లా న్యాయస్థానాలు, కోర్టు ఫీజులు, ప్లీడర్లు అంటూ పీల్చి పిప్పి చేసే రాద్ధాంతం వుండేది

## ధర్మసూక్ష్మం

కాదు. ప్రతి వూరికీ ఒక పంచాయితీ వుండేది. అందులో ఆయా కులాల పెద్దలందరూ న్యాయ నిర్ణేతలే. వారి న్యాయ నిర్ణయానికి ఆ వూరు వూరంతా కట్టుబడి వుండేది. ధర్మ నిర్ణయం నిష్పాక్షికంగానూ, నిర్దుష్టంగానూ వుండేదిరా. శిక్ష వెంటనే అమలు జరిగేదిరా. 'అన్యాయం జరిగేది కాదా' అంటావా, చాలా అరుదురా అబ్బాయ్. మానవత్వపు విలువలింకా చావ లేదురా అప్పటికీ. మానవ ధర్మమే ఉత్తమ ధర్మంగా వుండేదిరా. ప్రాధాన్యత మనిషికే కాని, డబ్బుకీ, అధికారానికీ వుండేది కాదురా అబ్బాయ్.

సరే కథలోకి వద్దాం.

సేనాపతుల వెంకన్నంటే 'ఆ తిక్క వెధవేనా' అనేవారు జనం. వాడు అపరిమితమైన కోపిష్ఠి. వాడికి కోపం ఎందుకొస్తుందో, ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలియదురా అబ్బాయ్. "ఏరా వెంకన్నా బుద్ధి లేదంట్రా గాడిదా" అని తిడితే, "అయ్, సిత్తవండి" అనేవాడు ఒకప్పుడు. "నిన్ను నరికి పోగులెట్టినా బుద్ధిరాదురా యెదవ కానా" అని అంటే; 'యెదవ కానా' అన్న మాటని వదిలేసి, 'బుద్దీ గిద్దీ అనమోకండి. మరేద గుండదు' అని పోట్లాటకొచ్చేవాడు. వాడి కోపం అలవాటయిపోయిన జనం, దాన్ని ఒక వినోదంగానే పరిగణించేవారు. హద్దు దాటేవారు కాదు. వాడిని హద్దు దాటనిచ్చేవారు కాదు. ఎందుకంటే కోపంలో ఉచితానుచితాలు పాటించేవాడు కాదు. నోటికే మాటొస్తే ఆ మాట తూలేవాడురా. ఆ కోపం తగ్గిపోయాక వాడు బాధపడేవాడనుకో. అప్పటికి పరిస్థితి చెయ్యిదాటి పోయేది. అందుకని, ఆ అవకాశం రానిచ్చేవారు కాదు ఆ వూరి జనం. వాడికి కోపం రావడానికి మనుషులే అవసరం లేదు. గొడ్డూ గోదా, పక్షీ చెట్టూ, పనీపాటూ ఏదైనా కావచ్చు. ఆలోచనకన్నా ఆవేశం హెచ్చు పాళ్ళలో వుండేది వాడికి. దానికి తగ్గట్టుగా అసహనం రెట్టింపు పాళ్ళలో వుండేదిరా అబ్బాయ్. వాడికి సెంటు భూమి లేదు. వున్నది ఒకే ఒక్క మగ్గం. దాని మీద వచ్చే సంపాదనే వాడి కుటుంబానికి ఆధారం. వీలైనంతవరకూ ఆ కోపాన్ని పట్టుదలగా మార్చించి, వాడి చేత పని చేయించుకునేది ఆ వూరు.

అటువంటి వెంకన్నకీ, వెంకటపతిరాజుకీ మధ్య తగవు తీర్చడానికి వూరంతా సమావేశమయింది. వెంకన్న వెనక సేనాపతులందరూ కట్టగట్టి వున్నారు. "మాట తూలింది వెంకన్నే కనుక తీర్పు మన పక్షమే" అన్న ధీమాతో రాజులున్నారు. తగవు తీర్చడానికి సావడి మీద పెద్దలున్నారు. 'ఏం జరుగుతుందో' అన్న వుత్సుకతతో వూరంతా వుందిరా అబ్బాయ్.

అసలేం జరిగిందంటే, సూరపరాజు గారి పెద్ద కొడుకు వెంకటపతిరాజుని సేనాపతుల వెంకన్న అనకూడని మాట అన్నాడు. దాని మీద అతగాడు కోపగించి గూబ గుయ్యిమనిపించాడు. అందుకు సేనాపతులందరూ గ్రామ పంచాయితీలో తగవెట్టారు. అదిరా



విషయం.

"ఈ గొడవెందుకు జరిగిందీ" అంటావా. చెబుతున్నారా అబ్బాయ్.

వెంకటపతిరాజు చెన్నపట్నంలో చదువుకుంటున్నాడు. కలిగిన మారాజుల బిడ్డ కనక దొరల చదువు చదవడం ఘనంగా భావించాడు కనక, తండ్రితో పోరుబెట్టి చెన్నపట్నంలో చదువుకోడానికి వెళ్ళాడురా. ఇల్లాలి పోరు పడలేకపోవడం వల్లనూ, ఇతరుల అభీష్టానికి తాను అవరోధం కావడం ఇష్టం లేని వాడవడం వల్లనూ, స్వతహాగా మంచి మనసు గలవాడవడం వల్లనూ ఆంగ్లేయులకి వ్యతిరేకి అయినా, సూరపరాజు గారు ఒప్పుకోవడం జరిగిందిరా అబ్బాయ్.

అలా చెన్నాపట్నం వెళ్ళి చదువుకుంటున్న వెంకటపతిరాజు సెలవులకి వచ్చాడు. వస్తూ వస్తూ తన పల్లెటూరి అందాల్ని చూపించడానికని స్నేహితుల్ని వెంటేసుకు వచ్చాడురా అబ్బాయ్. పట్నపు నాగరికతకి అలవాటు పడిన ఆ స్నేహ బృందానికి, పల్లెటూర్లో ప్రతీది ఒక వింతగానూ, వినోద హేతువుగానూ అనిపించిందిరా. అంతే గాకుండా అక్కడి జనం, ఆ వాతావరణం చాలా అనాగరికంగానూ, తమ ఆధిక్యతని నిరూపించేది గానూ అనిపించింది. ఆ పాటకజనపు మాటలు, వేషధారణ, అలవాట్లు ఆ మిత్ర బృందానికి పరిహాస కారకమూ అయ్యిందిరా అబ్బాయ్.

స్వచ్ఛమైన ప్రకృతిని, పరిశుద్ధమైన ఆప్యాయతని అనుభవించడం తెలియక కృత్రిమమైన విలువల్ని యాంత్రిక జీవనాన్ని పోషించుకునే నాగరికులకి పల్లెపట్టుల జీవన విధానం హాస్యస్ఫోరకం కావడం వింతేమీ కాదురా అబ్బాయ్.

ఆ వెంకటపతిరాజు మిత్ర బృందానికి ప్రతిదీ విచిత్రమే అయ్యిందిరా. తొడల దాకా ఎగగట్టిన పంచె, తలకి చుట్టిన తుండు గుడ్డ తప్ప మరే ఆచ్ఛాదనా లేని పురుషులు, పిక్కలు, మోకాళ్ళు కనిపించేలా చీర కట్టి నెత్తి మీద తట్టలతో సాగిపోయే పల్లె పడుచులు; రెండెడ్ల బళ్ళు; కాలవగట్లు, అమ్మవారి జాతర, హరికథలు, భజన కాలక్షేపాలూ మొదలైనవన్నీ కూడా వారికి చిత్రంగానూ, ఆదిమ సంస్కృతిలానూ తోచిందిరా. ఆంగ్ల భాషలో వారి పరిహాసోక్తులు ఏమిటో తెలియకపోయినా, వారు తమని అవహేళన చేస్తున్నారన్న విషయం, ఆ పాటక జనానికి అర్థమవకపోలేదురా. పె[illegible]టీ, అందునా నాలుగు రోజులుండిపోయే ఆ కుర్రకారు

తోటీ ఘర్షణ దేనికని ఆ పల్లె వూరుకుందిరా.

అలా ఆ వెంకటపతిరాజు బృందం అచ్చోసినఆంబోతుల్లా తిరుగుతున్న సమయంలో వారికి వెంకన్న తారసపడ్డాడురా అబ్బాయ్.

'ఒరేయ్, వీడో కోపిష్ఠి వెధవ. ఒక ఆట పట్టిస్తాను మాడండ్రా. మనకి కాలక్షేపమూ అవుతుంది'' అన్నాడ్రా వెంకటపతిరాజు.

''సై'' అంటే ''సై'' అన్నార్రా మిగతావాళ్ళు.

''ఏరా వెంకన్నా. ఈ రోజు మగ్గం పని లేదేంట్రా'' అన్నాడ్రా వెంకటపతిరాజు.

''ఎందుకు లేదండే'' అన్నాడ్రా వెంకన్న.

''నీకు తీరుబడెక్కడిదిరా?''

''తీరుబడేటండే. వుత్తినే కూసున్నానేటి''

''అందరితో దెబ్బలాడడానికే సరిపోతుంది. మగ్గమెప్పుడెక్కుతావురా''

'దెబ్బలాడడం తప్ప నాకు మరో పనేటీ లేదేటండే'

అలా ప్రారంభమయిన సంభాషణ దాలి గుంటలా రాజుకుని భగ్గుమందిరా. వెంకటపతిరాజు నవ్వుతూ కవ్విస్తున్న కొద్దీ, వెంకన్న రెచ్చిపోసాగాడు. అలా రెచ్చిపోయిన వెంకన్న కూడని మాట అనేశాడురా. దానికి తట్టుకోలేని వెంకటపతిరాజు 'ఏంట్రా కూసావు లం... కొడకా'' అని గూబ పగిలేలా కొట్టాడ్రా అబ్బాయ్.

ఏమీ చెయ్యలేని వెంకన్న బిత్తరపోయి గుడ్ల నీరు కుక్కుకుంటూ వెళ్ళిపోయాడురా. అంతవరకూ వాడితో మాటా మాటా అనుకున్నవాళ్ళే కాని చెయ్యి చేసుకున్న వాళ్ళెవరూ లేకపోయారురా. వ్యవహారం పెద్ద వాళ్ళతో అవడం వల్ల, అవమానాన్ని దిగమింగుకుని వెళ్ళిపోయాడురా అబ్బాయ్.

ఆ సంగతి తెలిసి, సేనాపతులందరూ పంచాయితీలో తగవెట్టార్రా.

అదిగో, అందుకు వూరంతా అక్కడ సమావేశమయింది. ఆ కుర్రకారు ఆగడాలకి విసిగి వున్న వూరంతా అక్కడికి చేరిందిరా అబ్బాయ్.

ఇరు పక్షాల వాదాలు విన్నారురా పుల్లయ్యగారూ, మిగతా వారూను.

''ఆడు తిక్కొడవే అనుకోండి. అందుకే గదండే, ఆడినోట్లో యెవరూ నోరెట్టరు. ఆడు మాట తూలాడే అనుకోండి. అది మాతో సెప్పొచ్చుగా. అంతే గాని పెద్దోళ్ళం గదాని సెయ్యి సేసుకోడవేటండే'' అన్నాడ్రా సేనాపతుల రామన్న.

''ఎంత తిక్క వెధవయితే మాత్రం, పెద్దా చిన్నా తారతమ్యం లేకుండా అనకూడని మాట అనెయ్యడవేవిటండీ'' అని ఎగిరిపోయాడ్రా వెంకటపతిరాజు.

కనీసపు మర్యాదనైనా పాటించకుండా వెంకటపతిరాజు నిలబడిన తీరు, ఆ మాట విసురు, తల ఎగరేసే విధానం; అక్కడ జేరిన వారెవరికీ నచ్చుబాటు కాలేదురా అబ్బాయ్. ''వీళ్ళా నన్ను తప్పు పట్టేది'' అన్న నిర్లక్ష్య ధోరణే కనిపిస్తోంది తప్ప, పెద్దలపట్ల, అందునా న్యాయస్థానం పట్ల అతని కుండవలసిన విధేయత, గౌరవం, వినయం మచ్చుకి కూడా ద్యోతకం కావటం లేదురా. దానికి తోడు అతని సరసన నిలబడ్డ మిత్ర బృందపు వైఖరి అక్కడున్న వారందరికీ, ఆఖరికి రాజులకి కూడా కంటగింపుగా వుందిరా అబ్బాయ్.

''బాబూ, ముందుగా వాడు నిన్ను పలకరించాడా, నువ్వు వాడిని పలకరించావా'' అనడిగార్రా పుల్లయ్య గారు.

''నేనేనండి'' అన్నాడ్రా వెంకటపతిరాజు, 'వాడికి నన్ను పలకరించే ధైర్యమా' అన్న ధోరణిలో.

''ఎందుకు?''

''సరదాకండి''

''వాడితో పరాచికాలాడే చనువుందా నీకు''

''వాడితో చనువేటండీ'' అన్నాడురా వెంకటపతిరాజు.

''అంటే వాడి స్వభావం తెలిసే వాడిని నువ్వు పలకరించావన్నమాట.''

''చెప్పాను కదండీ, సరదాకని.'' ఆ అనడంలో ''ఏమిటీ నస'' అన్న ధోరణి ప్రస్ఫుటిస్తోందిరా.

ఆ విధంగా ఆ పంచాయితీలోనూ, పై పెచ్చు పుల్లయ్యగారితోనూ మాట్లాడిన వ్యక్తే లేదురా ఆ గ్రామంలో. పుల్లయ్య గారంటే వెంకటపతిరాజుకి తెలియదని కాదు. వయసు యొక్క టెంపరితనమూ, పట్నవాస ప్రభావమూ, స్నేహితుల ముందు తన గొప్పతనాన్ని చాటుకోవాలనే వుబలాటమూ అతగాడి ప్రవర్తనకి మూల హేతువుల్రా అబ్బాయ్.

కొడుకు ధోరణికి సూరపరాజుగారిలో కోపం క్రమేపీ రగులుకోసాగిందిరా అబ్బాయ్.

''వాడికి తిక్క కోపమనీ, ఆ కోపంలో వాడు పిచ్చివాడవుతాడనీ తెలిసి చేసిన పని కనుక, ఆ ఫలితాన్ని నువ్వు అనుభవించవలసిందే'' అన్నార్రా అబ్బాయ్ పుల్లయ్యగారు పరమ శాంతంగా.

''నేనెందుకనుభవించాలండీ...'' అని ఏదో అనబోతున్న వెంకటపతిరాజుని ''నోరు ముయ్యెహె'' అని గదమాయించాడురా సూరపరాజు.

పంచాయితీలో వున్న సభ్యుల కేసి చూసి, సమావేశమయిన జనంకేసి చూసి, ఈ విధంగా పుల్లయ్యగారు న్యాయ నిర్ణయం చేసార్రా అబ్బాయ్.

''సేనాపతుల వెంకన్నకి తిక్క కోపమనీ, అటువంటి సమయంలో వాడు ఉచితానుచితాలు విస్మరిస్తాడనీ తెలిసి, కేవలం తన స్నేహితుల్ని వినోదింపజేయడం కోసం అతడిని వెంకటపతిరాజు రెచ్చగొట్టడం జరిగింది. పరిమితి దాటిన పరిహాసానికి తట్టుకోలేని వెంకన్న, స్వాభావికంగా ఆవేశంలో వున్మత్తుడవుతాడు కనుక; తాను ఏమిటి మాట్లాడుతున్నాడో తెలియని స్థితిలో మాట జారడం జరిగింది. అందుకు బాధ్యుడు వెంకన్న మటుకు కాదు. వెంకన్నని ఆ స్థితికి తీసుకెళ్ళిన వెంకటపతిరాజే బాధ్యుడు. వెంకన్నని రెచ్చగొట్టడం మొదటి తప్పు. అవతలి వాడిని మాట అనేటప్పుడు, అటు నుంచి వచ్చే మాటని కూడా తట్టుకోవడానికి సిద్ధ పడివుండాలి. తనకున్న సాంఘిక హోదా యొక్క అండ జూసుకుని, వెంకన్నకి తిరగబడే ధైర్యం లేదని తెలిసి, అతని మీద వెంకటపతిరాజు చెయ్యి చేసుకున్నాడు. అది రెండవ తప్పు.

తన కోపాన్ని అదుపులో వుంచుకోవాలని వెంకన్నని హెచ్చరిస్తూ; ఒక అమాయకుణ్ణీ, మూర్ఖుణ్ణీ, అర్భకుణ్ణీ; అతని స్వభావం తెలిసి కూడా, తన స్నేహితులకి వినోదాన్నివ్వడం కోసం- ఆ వ్యక్తిని మానసికంగానూ, శారీరకంగానూ కూడా హింసించాడు కనుక, వెంకట పతిరాజుని దోషిగా నిర్ణయించడమైనది'' అని స్పష్టం గానూ, నిక్కచ్చిగానూ పలికార్రా అబ్బాయ్ పుల్లయ్య గారు.

విసురుగా ఏదో అనబోతున్న వెంకటపతిరాజు మీదికి ఒక్క అంగలో దూకి, సాచి లెంపకాయ కొట్టి, 'నోరు ముయ్యరా యెదవ కానా, వచ్చినప్పటి నుంచి సూత్తానే వున్నాను- నీ యేసాలు, నీ స్నేయితుల యేసాలు. కులం సెడగొట్టడానికే పుడతార్రా నీలాటి యెదవలు. సదువుతున్నాడు సదువు. మంచీ సెబ్బరా, మరేదా మన్ననా మర్చిపోయినాంక, సంకనాకడాని కేంట్రా సదివేది. మళ్ళీ సెన్నాపట్నం పేరెత్తావంటే మక్కెలిరగ దంతాను. రేపటి సంది పొలాని కెళ్ళు'' అని గర్జించాడురా సూరపరాజు.

అదిరా అబ్బాయ్- నాటి ధర్మం. ●

